# ముత్యాల మనసు

- ఇల్లిందల సరస్వతీదేవి

ఇల్లిందల సరస్వతీదేవిగారు 1915లో జన్మించారు. కలం పట్టినప్పటి నించి ఒక లక్ష్యంతో రచనలు చేసిన విదుషీమణి. సాంఘిక సేవలో, రాజకీయ రంగంలో కూడా విశిష్ట స్థానాన్ని సంపాయించుకున్న ఆ తరం రచయిత్రి. " ఇయం గేహే లక్ష్మిః" పేరుతో ఆనాటి కృష్ణా పత్రికలో వ్యాసపరంపరను చాలాకాలం అందించి పలువురు అభిమానులను సంపాయించుకున్నారు. లోకం పట్ల చక్కని అవగాహన, విశాల దృక్పథం సరస్వతీదేవి గారి రచనల్లో ద్యోతకమవుతాయి. అక్కరకు వచ్చిన చుట్టము, ముత్యాల మనస్సు, పండుగ బహుమానం మొదలైన కథా సంపుటాలు వెలువడ్డాయి. అనేక వ్యాసాలు వీరి కలం నించి వెలువడి, తెలుగు పాఠకుల మనసులపై చెరగని ముద్ర వేశాయి.

## ఆణిముత్యాలు

ముత్యాలు తల్లి వెంట తిరుగుతూ "అమ్మా! దీనిమీద ఎక్కుతానే" అంటూ కుర్చీ ఎక్కబోయాడు.

"అమ్మగారు చూస్తే తంతారు. దిగుదిగు" పిల్లవాడిని దించి తన పనిమీద అవతలికి వెళ్ళిపోయింది వెంకటి.

తల్లిని వెళ్ళనిచ్చి - ముత్యాలు తనకు సరిపోయినట్లుగా కనబడ్డ ఆ చిన్న కుర్చీ మీద కూర్చుని - కాళ్ళు నేలకు తాకేట్లుగా ముందుకు జరిగి - చేతులు రెండూ కుర్చీ చేతుల మీద పెట్టి తనను తాను చూచుకొని - తల ఇటూ అటూ తిప్పి చూశాడు. తన సంగతి ఎవరూ చూడలేదన్న ధైర్యంతో బాగా సర్దుకొని కుర్చీలో వెనుకకు జరిగి కూర్చున్నాడు. కాలిమీద కాలు వేసుకొని విలాసంగా ఊపుతూ ఒక్కసారి తల పైకెత్తాడు. ముత్యాల కెదురుగా గోడదగ్గర ముత్యాలు కూర్చున్నటువంటి కుర్చీలో - వాడి వంటి పిల్లవాడే కూర్చున్నట్లుగా కనబడ్డది. సరిగ్గా వాడి చొక్కా ముత్యాలు వేసుకున్న దాని మాదిరిగానే ఉన్నది. భుజం మీద చినుగూ అదీను. ముందు భాగమంతా నల్లగా మాసిపోయి అట్టకట్టి ఉన్నది. వాడి ముఖం, తల, జుట్టు అంతా ముత్యాలు లాగే ఉన్నాడు. ముత్యాలు తననూ వాడినీ పరకాయించి చూస్తూ, పోల్చుతూ తన దేహాన్ని తడిమి చూసుకుంటూ ఆశ్చర్యపడిపోతున్నాడు.

ముత్యాలుకు కలిగిన ఆశ్చర్యం కుతూహలం క్రిందికి మారటానికి ఎంతోసేపు పట్టలేదు. కుర్చీ మీద నుంచి లేచి, మెల్లగా అడుగులు వేస్తూ, ఆ పిల్లవాడి దగ్గరికి బయలుదేరాడు ముత్యాలు. ఇట్లా రెండు అడుగులు వేశాడో లేదో, ఎదుటి పిల్లవాడు ఈ సంగతి గ్రహించినట్లే ఉన్నాడు - లేచి, ముత్యాలు కెదురుగా వస్తున్నాడు. ముత్యాలు ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. మనసు జంకుతున్నా, ధైర్యం చేసి ముందుకు అడుగులు వేశాడు ముత్యాలు. తీరా అక్కడికి చేరుకుంటుండగా వాడి ఆశ్చర్యం మరీ ఎక్కువైపోయింది. ఆ పిల్లవాడు మొదలు అంత ధైర్యంగా బయలుదేరాడుగాని, తీరా ముత్యాలు తన దగ్గరికి వచ్చేసరికి తళతళలాడుతున్న గోడకు అంటుకొనిపోయాడు. అయినా అదలించి చూద్దామని ముత్యాలు చెయ్యి ఎత్తాడు. దానికి జవాబుగా వాడూ చెయ్యి ఎత్తాడు. ముత్యాలు దించగానే వాడూ దించాడు. తాను నవ్వితే వాడూ



నవ్వుతున్నాడని ముత్యాలుకు అక్కసు కలిగి చేత్తో పట్టుకోబోయినాడు. కాని, వాడు అందలేదు.

ముత్యాలుకు చాలా ఆశ్చర్యము కలిగింది. ఆ గోడలో యీ పిల్లవాడే కాదు. ఆ గదిలో ఉన్న మంచాలు, కుర్చీలు, బల్లలు, ఉయ్యాల అన్నీ కనబడుతున్నాయి. బట్టలు మడతచేస్తూ అటు ఇటు తిరిగి నిలబడిన తల్లి కాలిదగ్గర్నుంచి తలవరకూ కనబడుతున్నది! ముత్యాలు మనసు ఆశ్చర్యంతో, ఆనందంతో గంతులు వేసింది. వాడు పకపక నవ్వుతూ ఎడమచేతి వైపుగా వెళ్ళి అక్కడ చిన్న గోడకు ఉన్న జాలీగుండా కిందికి చూశాడు. పెద్ద తోటా, ప్రహరీగోడ నానుకొని ఉన్న ఓ చిన్న గదీ కనబడ్డాయి. ఆ గదిలో కటిక చీకటి. సన్నటి నూనెదీపము గాలికి కదులుతూ ఉంటుంది. ఈ గది ఎంత బాగుందో? నున్నటి నేల, నేలమీద పరచిన రంగు రంగుల చాపలు, వాటిమీద నడుస్తుంటే ఇంకా నడవాలనిపించింది. ఆ మంచము ఎంత చక్కగా ఉన్నదో!"

హఠాత్తుగా ముత్యాలు ముఖం ముడుచుకొని పోయింది. తన తల్లి ఆ వెధవ గదిలో చింకిచాపమీద బొంతగుడ్డ ఒకటి పడేసి పడుకోమని ఒక్క కేక పెడుతుంది. ఆ వాసన కొట్టున్న బొంతమీద కళ్ళ నీళ్ళు కారుస్తూ కళ్ళు మూసుకొని పడుకోవాలి. నాయనకూడా పడుకోమని కేక పెట్టూనే ఉంటాడు.

ముత్యాలు మెల్లగా అక్కడి నుంచి లేచి మంచం దగ్గరికి వెళ్ళి దానిమీద పరచిన దుప్పటిమీద చెయ్యివేసి తాకి చూశాడు. అది వాడి బొంతనూ, చొక్కాను తాకినట్టుగా లేదు. వాడి తండ్రి వేసుకునే ఖాకీబట్టలు తాకినట్టుగా కూడా లేదు. చేతికెంతో మెత్తగా తాకింది. వాడి కెంతో బాగనిపించింది. మళ్ళీ మళ్ళీ తాకుదామనిపించుతున్నది. "అబ్బ! ఏమిటీ...

ఎంత మెత్తగా తాకుతున్నది?" అనుకుంటూ కనుబొమలు పైకెత్తాడు. వెంటనే వాడి కేమనిపించిందో, ఆ మంచమెక్కి రెండు కాళ్ళూ చాపి వెల్లకిలా పడుకొని, సంభ్రమంకొద్దీ కళ్ళు మెరుస్తూండగా వాడిలో వాడే అనుకుంటున్నాడుః " ఇంత బాగున్న మంచముమీద తనను పడుకోబెట్టకుండ ఆ వెధవ చింకిచాపమీద పడుకోబెట్టుతుందేం తన తల్లి! అంత చెడ్డ దేమిటి?"

ముత్యాలు బాగా ఆలోచించి నిశ్చయించుకున్నాడు. "ఏమయినా సరే – తానా మంచముమీద పడుకోవలసిందే! ఇక తానెప్పుడు ఆ చింకిచాపమీద పడుకోడు. వాసన కొట్టుతున్న ఆ బొంతను చేత్తో అయినా తాకడు."

" ఆరి వెధవా! అమ్మగారు చూస్తే తంతారు. దుప్పటి నలిగిపోయింది. లే" అని వెంకటి గదమాయించి రెక్కపట్టి కిందకి లాగేవరకు ముత్యాలుకు ఆ ఊహే పోలేదు. "నేను దానిమీదనే పడుకుంటాన"ని ముత్యాలు మళ్ళీ మంచము ఎక్కబోయాడు. వెంకటి చెయ్యిపట్టి ఇవతలికి లాగి "తప్పు తప్పు! నాయన పిలుస్తున్నాడు కిందికిపో" అని ఒక్కతోపు తోసింది. ముత్యాలు కెవ్వుమన్నాడు. వాడికి అక్కడి నుంచి వెళ్ళాలనిలేదు. మళ్ళీ మంచం వైపు దారితీశాడు.

అంతలో "వెంకటీ" అన్న పిలుపు వినబడ్డది. వెంకటికి తొందర ఎక్కువైంది. ముత్యాలు తనమాట విననందుకు కోపం వచ్చింది. యజమానురాలు చూస్తే ఇంకేమయినా ఉన్నదా? బాబును నిద్రపుచ్చే వేళకూడా అయింది. బాబు చికాకు చేసుకొని కేకలు వేస్తున్నాడు. వెంకటి కోపముతో, ఆదుర్దాతో, "కిందికి పో వెధవా" అన్నది. తల్లి అంతగా ఎందుకు కోపము చేస్తున్నదో ముత్యాలుకర్థంకాక నిలబడిపోయాడు. యజమానురాలు మళ్ళీ పిలవటంతో వెంకటికి తొందర ఎక్కువై వాడి తలమీద దెబ్బవేసి అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

ముత్యాలు తలను తడిమి చూసుకుంటూ ఏడవటం మొదలుపెట్టాడు. అంతలో తండ్రి ఎటునుంచి వచ్చాడో మరో రెండు దెబ్బలు తగిలించి చెయ్యి పట్టుకొని ఈడ్చుకు వెళ్ళాడు.

ఆ మరుసటి ఉదయము ముత్యాలు నిద్రలేవగానే తల్లి ఎప్పటివలె కనబడలేదు. "లేవరా ముత్తిగా!" అని తండ్రి గదమాయించాడు. ముత్యాలుకు ఏడుపు వచ్చింది. "పెద్దమ్మగారి ఊరు నుంచి ఇక్కడికి వచ్చినప్పటి నుంచీ అమ్మా నాయన తననిట్లానే గదమాయిస్తున్నారు. ఆ చీకటిగది దాటి బయటికి రానివ్వరు. ఎంతసేపయినా అక్కడే కూచోవాలి. పెద్దమ్మగారి ఊళ్ళో చల్లగాలికి చెట్లకింద పిల్లలతో గోలీలాడుతుంటే ఎంతబాగుండేది! అనిపించింది ముత్యాలుకు.


అంతలో తండ్రి మళ్ళీ తనదగ్గరికి రావటం ముత్యాలు కంటబడ్డది. మెల్లగా లేచాడు. తండ్రి బలవంతంగా ఈడ్చుకొనిపోయి ముఖము కడిగించి, ఒక గిన్నెలోపట్టెడన్నము కారపుముద్ద పడేసి ముందు పెట్టాడు. కళ్ళనీళ్ళతో తండ్రిమీద కోపము కొద్దీ ముత్యాలు ఒకముద్ద నోట్లో పెట్టుకోగానే దగ్గు వచ్చింది. "కుండలో నీళ్ళు ముంచుకొని తాగరా వెధవా!" అని కసిరాడు తండ్రి. భయముకొద్దీ ఆ నాలుగు మెతుకులూ తిని యిన్ని నీళ్ళు తాగాడు ముత్యాలు.

" ఇక్కడే వుండు. కదలకు!"అంటూ తండ్రి ఖాకీచొక్కా వేసుకొని తోటవైపు వెళ్ళిపోయాడు. ముత్యాలు చేతిగోళ్ళు కొరుక్కుంటూ ఆ గడపమీద కూర్చున్నాడు.

మేడమీద వరండాలో తల్లి బాబును ఎత్తుకొని బిస్కట్లు తినిపిస్తూ బొమ్మలు చూపిస్తూ తిరుగుతున్నది. అది చూచి ముత్యాలు ఆత్రముతో "అమ్మా అమ్మా" అని కేకపెట్టాడు. వెంకటి ఇటువైపు చూడనన్నాలేదు. బాబుచేతిలో ఉన్న బిస్కట్టుముక్క చూడగానే ముత్యాలుకు తాను తిన్న కారపు మెతుకులు జ్ఞాపకము వచ్చాయి. 'అప్పుడు తల్లి దగ్గరవుంటే ఆ బిస్కట్టు యిచ్చేదేమో!' ముత్యాలు తల్లి దగ్గరికి వెళ్ళాలని బయలుదేరుతుండగా, తండ్రి రానేవచ్చాడు. " ఎక్కడికిరా వెళ్ళేది?" అని మళ్ళీ వెనక్కిలాగి గదిలోకి నెట్టాడు.

వారం రోజుల తరువాత ముత్యాలుకు జ్వరం తగిలింది. పిల్లవాడిని చూసిపొమ్మని వెంకటికి ముత్యాలు తండ్రి చెప్పి పంపాడు. క్రమం తప్పకుండా అన్ని పనులూ చేసి వెంకటి మధ్యాహ్నపు వేళకి ముత్యాలును చూడటానికి వచ్చింది. ముత్యాలు మేలుకొనే ఉన్నాడప్పుడు. తల్లిని చూడగానే "నీ వెంట వస్తాన"ని ఏడుపు సాగించాడు. "వద్దుర, నీవు

రాకూడదు'' అంటూ వెంకటి ఎంత చెప్పినా ముత్యాలు ఏడుపు మానలేదు. బాబు ఏడుపు విని వెంకటి వెళ్ళిపోయింది. తండ్రి దగ్గర కూర్చొని కళ్ళు తుడిచి చాపమీద ముత్యాలును పడుకోబెట్టాడు.



కళ్ళనీళ్ళతో ముత్యాలు మేడవైపు చూశాడు. బాబుని ఎత్తుకొని తన తల్లి నిలబడ్డది. బిస్కట్టు తినిపిస్తూ ముద్దు పెట్టుకుంటున్నది.

ముత్యాలు మనసు భగభగమన్నది. ఏడుపు పెద్దదిచేసి లేచి కూర్చున్నాడు. తండ్రి మంచి మాటలతో ఎంత చెప్పినా వినలేదు. ఏడుపు మానలేదు. అతడికి విసుగుపుట్టి వీపుమీద అయిదువేళ్ళూ అంటేటట్టుగా కొట్టాడు. ఆ జ్వరపు ఒంటిమీద అయిదు వేళ్ళూ వాతలు తేలాయి..

ఆరేళ్ళ నిండీనిండని ముత్యాలు మనసులో ఆ ఊరు వచ్చిననాటి నుండీ ఒక విషయమే కెలకవేస్తూ వచ్చింది. 'పెద్దమ్మగారి ఊళ్ళో ఉన్నప్పుడు తల్లి తనను ఎత్తుకొని తిరిగేది. దగ్గర తిరిగేది. దగ్గర పడుకోపెట్టుకొనేది. ఇక్కడికి వచ్చిన దగ్గర నుండీ తననా చీకటిగదిలో పడేసి, వాళ్ళ బాబును ఎత్తుకుంటున్నది. తనని దగ్గరికైనా రానివ్వటంలేదు. తనకా చింకిచొక్కా తప్ప మరొకటి వెయ్యటం లేదు. బాబుకు మంచి బట్టలు వేస్తున్నది. ఆ బాబును ముద్దుకూడా పెట్టుకుంటున్నది. తనను నాయనా, అమ్మా ఇద్దరు ఒకటే కొట్టటం మొదలుపెట్టారు. ఎందుకని?''

ముత్యాలుకు ముఖ్యంగా ఆ ఊరు నచ్చలేదు. తనతోకూడా ఆడుకొనే పిల్లలు ఇక్కడ లేరు. 'ముత్తిగా' అని ముద్దుగా పిలిచే తల్లి 'వెధవా' అంటున్నది.

ముత్యాలుకు తన పెద్దమ్మగారి ఊరి తోవ తెలియదు. కానీ, అక్కడి నుంచి ఎనిమిది రోజులు నడిచిరావటం మాత్రం జ్ఞాపకమున్నది.

ముత్యాలు ఒంటిమీది జ్వరం జారలేదు. తండ్రి తోటపని చేసుకుంటూ ముత్యాలును చూస్తున్నాడు. వెంకటి బాబు నిద్రపోయినప్పుడు మాత్రము వచ్చి చూసి పోతున్నది-- అదికూడా ముత్యాలు కన్నుమూసినప్పుడే. మెలకువగా ఉంటే ముత్యాలు తల్లిని విడువడు గదా!

అప్పటికి ముత్యాలు తల్లిని చూసి నాలుగు రోజులైంది. సాయంత్రపువేళ తండ్రి చెట్లకు నీళ్ళు పోస్తున్నాడు. ముత్యాలు మెల్లగా లేచాడు. మేడమీదికి ఒకసారి చూశాడు. తల్లి కనబడలేదు. తలుపులు బార్లా తెరచిన గేటును చూడగానే ముత్యాలు అడుగు ముందుకు పడ్డది. జ్వరపు ఒంటితో ఒకవీధి – రెండవ వీధి – క్రమముగా దాటిపోతున్నాడు. జ్వర తీవ్రతచేత ముత్యాలు శరీరము తూలిపోవటం మొదలు పెట్టింది. మూడవ వీధిలోకి రాగానే కళ్ళు చీకట్లు కమ్మినట్లయినది. కాళ్ళు తడబడిపోయి, రోడ్డు ప్రక్కగా ఉన్న తూములో జారిపడ్డాడు. మరో రెండు నిముషాలకు సారా బట్టీలోంచి పొగలు గక్కుతున్న వేడినీళ్ళు ఆ తూముగుండా ప్రవహించాయి.

చీకటిపడ్డ తరువాత వెంకటి అబ్బాయిగారిని యెత్తుకొని ముద్దులాడుతూ ఉండగా ముత్యాలుకోసం తండ్రి వీధివీధి వెతకటం మొదలుపెట్టాడు. ○